సాక్షి నిర్మల్

శనివారం । 9 । నవంబర్ । 2024

అట్టహాసంగా నెట్‌బాల్ పోటీలు



నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో రాష్ట్రస్థాయి అండర్- 16 సబ్ జూనియర్స్ నెట్ బాల్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి.

10లో▸

నేడు, రేపు సీసీఐ కొనుగోళ్లు బంద్

భైంసాటౌన్: భైంసా ఏఎంసీ పరిధిలో ఈనెల 9, 10 తేదీల్లో సీసీఐ కొనుగోళ్లు నిలిపేస్తున్నట్లు ఏఎంసీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పూర్యానాయక్ శుక్రవారం తెలిపారు. సోమవారం నుంచి యథావిధిగా కొనుగోళ్లు జరుపుతామని పేర్కొన్నారు. రైతులు గమనించి సహకరించాలని కోరారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0 / 18.4

ఆకాశం నిర్మలంగా ఉటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు బాగా తగ్గుతాయి. చలి ప్రభావం పెరుగుతుంది. రాత్రి నుంచి తెల్లవారు జాము వరకు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఇన్‌చార్జి డీఆర్వోగా రత్న కళ్యాణి



బాధ్యతలు స్వీకరిస్తున్న రత్నకళ్యాణి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారిగా ఆర్డీవో రత్న కళ్యాణి శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్వో కార్యాలయంలో అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది పలువురు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు బీజేపీ సంస్థాగత ఎన్నికల వర్క్‌షాప్

నిర్మల్‌చైన్‌గేట్: బీజేపీ సంస్థాగత ఎన్నికల జిల్లాస్థాయి వర్క్‌షాప్ శనివారం పట్టణంలో జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తామని సంస్థాగత ఎన్నికల సహ కోఆర్డినేటర్ సామ రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. వర్క్‌షాప్‌కు రాష్ట్ర శాసనసభాపక్షనేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా సంస్థాగత ఎన్నికల ఇన్‌చార్జి ప్రేమేందర్ రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే పవార్ రా మారావుపటేల్ హాజరవుతారని తెలిపారు. వర్క్‌షాప్‌కు రాష్ట్ర, జిల్లా బాధ్యులు, అన్ని మోర్చాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, మండల ఇన్‌చార్జీలు, ప్రజాప్రతినిధులు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, అన్ని మండలాల సంస్థాగత ఎన్నికల అబ్జర్వర్లు రావాలని కోరారు.

గౌడ యువజన సంఘం అధ్యక్షుడిగా మహేశ్వర్‌గౌడ్



నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

ఖానాపూర్: తెలంగాణ గౌడ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఖానాపూర్ పట్టణానికి చెందిన దొనికెల మహేశ్వర్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా గడ్డం మహేందర్(కుభీర్), కార్య నిర్వాహక అధ్యక్షుడిగా గడ్డం మహేందర్ (నిర్మల్), తీగెల భోజరాజ్, గొట్టిపడ్డ గజేందర్, కత్తి శేఖర్, ఉపాధ్యక్షులుగా సిర్ర గణేశ్, కోల సంతోష్, కొండ సతీశ్, తాళ్లపల్లి మహేశ్, పుల్లకోత సాయన్న, ప్రధాన కార్యదర్శులుగా బుర్ర రమేశ్, డి. బాబు, కార్యదర్శులుగా శేఖర్, మహేశ్, అర్జున్, సాయి, ప్రశాంత్, కోశాధికారిగా సల్ల జలేందర్, అధికార ప్రతినిధులుగా అజయ్, సాగర్, రాకేశ్, రమేశ్, సాయినాథ్, ప్రచార కార్యదర్శులుగా కృష్ణ, ప్రవీణ్, శివాజీ, అరుణ్, తదితరులు ఎన్నికయ్యారు.

'హరిత' వృక్షాలకు నిప్పు



లక్ష్మణచాంద: రాష్ట్ర ప్రభుత్వం అడవులు పెంచేందుకు ఏటా హరితహారం కార్యక్రమంలో భాగంగా లక్షల మొక్కలు నాటుతోంది. లక్ష్మణచాంద మండలంలో వేలాది మొక్కలు పెంచుతాన్నారు. అయితే కొందరు ఎదిగిన హరిత వృక్షాలకు నిప్పు పెడుతున్నారు. మండలంలోని కనకాపూర్ నుంచి మండల కేంద్రం వరకు డబుల్ రోడ్డుకు ఇరువైపులా అటవీ శాఖ ఆధ్వర్యంలో నాటిన మొక్కలు వృక్షాలుగా ఎదిగాయి. మండల కేంద్రంతోపాటు, ఇతర గ్రామాల రైతులు చెట్లను చంపేస్తున్నారు. వృక్షాల మొదట మొక్కజొన్న కున్నెలు వేసి నిప్పు పెడుతున్నారు. దీంతో వృక్షాలు కాలిపోయి ఎండిపోతున్నాయి. మండల అధికారులు పట్టించుకోవడం లేదు.

స్టార్ ఈఎంటీగా తిరుపతి



అవార్డు అందుకుంటున్న తిరుపతి

ఖానాపూర్: జిల్లాలో 108 అంబులెన్స్‌లో విధులు నిర్వహిస్తున్న తిరుపతి స్టార్ ఈఎంటీ అవార్డును అందుకున్నాడు. తిరుపతి అందించిన ఉత్తమ సేవలకుగానూ ప్రథమ చికిత్స విభాగంలో స్టార్ ఈఎంటీ అవార్డును క్లస్టర్ ప్రాజెక్ట్ మేనేజర్ మధుకర్, జిల్లా ఈఎంఈ లింగాచారి ప్రదానం చేశారని తిపపతి తెలిపారు.

భయో వేస్ట్!

- ఆస్పత్రుల్లో అస్తవ్యస్తంగా వ్యర్థాల నిర్వహణ
- జిల్లా వ్యాప్తంగా నిర్లక్ష్యంగా సేకరణ
- నిబంధనలకు విరుద్ధంగా మున్సిపల్ చెత్త ట్రాక్టర్లకు అందజేత
- డబ్ల్యూహెచ్‌వో, పీసీబీ నిబంధనలు బేఖాతరు
- పట్టించుకోని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు



ప్రసూతి ఆసుపత్రిలో డ్రమ్ములో వేస్తున్న వ్యర్థాలు



వ్యర్థాలు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబొరేటరీల బయో మెడికల్ వ్యర్థాల సేకరణ నిబంధనల ప్రకారం జరగడం లేదు. ఆస్పత్రుల్లోని ఈ వ్యర్థాలను మున్సిపాలిటీ సిబ్బంది సేకరిస్తూ డంపింగ్ యార్డులకు చేరుస్తున్నారు. దీంతో సిబ్బంది కూడా అనారోగ్యం బారిన పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లోని బయో మెడికల్ వ్యర్థాల సేకరణను ప్రభుత్వం ఇన్సినరేటరీ ఏజెన్సీకి అప్పగించింది. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ సంస్థలు 11 ఉన్నాయి. ఆయా సంస్థలతో ఆస్పత్రులు అనుసంధానమై బయోమెడికల్ వేస్టేజ్‌ను అప్పగించాల్సి ఉంటుంది. ఇందుకోసం సంబంధిత ఏజెన్సీకి ఆస్పత్రులు ఒక్కో బెడ్‌కు రూ.7 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. అయితే జిల్లాలో ఆస్పత్రుల నుంచి బయో మెడికల్ వేస్టేజ్ సేకరణ సక్రమంగా సాగడం లేదు.

రోజుల తరబడి నిల్వ..

ప్రభుత్వం నిర్దేశించిన ఏజెన్సీతో బయోమెడికల్ వేస్టేజ్ నిర్వహణపై ప్రతీ ఆస్పత్రి ఒప్పందం కుదుర్చుకోవాలి. అందుకు అవసరమైన చార్జీలను ఆస్పత్రులు చెల్లించాలి. కానీ చాలా ఆస్పత్రులు నిర్వహణభారం పేరుతో ఇన్సినరేటరీలకు అప్పగించకుండా మున్సిపాలిటీ సిబ్బందికే బయోమెడికల్ వేస్టేజీను అప్పగిస్తున్నాయి. ఆస్పత్రిలో పోగైన బయో మెడికల్ వేస్టేజీను 48 గంటల్లోగా సంబంధిత ఇన్సినరేటరీకి అప్పగించాల్సి ఉండగా, వారం నుంచి పది రోజులపాటు నిల్వ చేస్తూ బహిరంగ ప్రదేశాల్లో పడేస్తున్నారు. బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రకారం నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు ఉన్నా ఆస్పత్రులు పాటించడం లేదు. సంబంధిత అధికారులు సైతం పట్టించుకోవడం లేదు.

ప్రత్యేక బ్యాగుల్లో వ్యర్థాల సేకరణ..

ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు, క్లినిక్‌లు, డిస్పెన్సరీలతోపాటు పశువైద్య సంస్థలు, బ్లడ్ బ్యాంక్‌లు, ఆయుష్ ఆస్పత్రులు, పరిశోధన విద్యా సంస్థలు, ఆరోగ్య శిబిరాలు, ఆపరేషన్ థియేటర్ల నుంచి బయో మెడికల్ వ్యర్థాలు వెలువడుతాయి. వీటిని నాలుగు రకాలుగా విభజించి నిల్వ చేయాలని డబ్ల్యూహెచ్‌వో, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. రెడ్, ఎల్లో, వైట్, బ్లాక్ బ్యాగులను కేటాయించి వీటిల్లో విడివిడిగా బయో మెడికల్ వ్యర్థాలను సేకరించాల్సి ఉంటుంది. సిరంజీలు, సాయిల్డ్, గ్లాస్‌లు, కాథెటర్స్, ఐవీ ట్యూబులను రెడ్ కలర్ బ్యాగ్‌లో వేయాలి. బాడీ ఫ్లూయిడ్స్, బ్లడ్ బ్యాగులు, మానవ శరీర వ్యర్థాలు, శరీర భాగాలతో కూడిన డ్రెస్సింగ్ పట్టీలను ఎల్లో బ్యాగులో వేయాల్సి ఉంటుంది. సూదులు, షార్పులు, బ్లేడ్లను వైట్ పంక్చర్ ప్రూఫ్ కంటైనర్(పీపీసీ) బ్యాగులో వేయాలి. బయోమెడికల్ కాని వ్యర్థాలను బ్లాక్ కలర్ బ్యాగులో వేయాలి. ఆస్పత్రులు ఈ నిబంధనలను అమలు చేయాల్సి ఉండగా చాలా వరకు పాటించడం లేదు. ఫలితంగా బయోమెడికల్ వ్యర్థాలు సాధారణ వ్యర్థాల్లో కలిసిపోతున్నాయి.

మున్సిపల్ సిబ్బందికి అవగాహన లేక..

ఆస్పత్రుల్లో బయోమెడికల్ వ్యర్థాలను సంబంధిత ఇన్సినరేటరీలు సేకరించాల్సి ఉండగా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. ప్రమాదకరమైన బయో మెడికల్ వేస్టేజ్ మున్సిపాలిటీ డంపింగ్ యార్డులకు చేరుతోంది. ఈ వ్యర్థాలను మున్సిపల్ సిబ్బంది ఎట్టిపరిస్థితుల్లో సేకరించవద్దని కఠిన నిబంధనలు ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అసలు వీటిపై సిబ్బందికి సరైన అవగాహన లేదు. మున్సిపల్ సిబ్బంది బయో మెడికల్ వ్యర్థాలను సేకరించడం, వాహనాల్లో తరలించడం, డంపింగ్ యార్డులో నిల్వ చేస్తుండటంతో సిబ్బందితోపాటు సమీప ప్రాంత ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారు. బయో మెడికల్ వ్యర్థాలను ప్రత్యేకంగా సేకరించి ఇన్సినరేటరీలకు అప్పగించాలి. ఇతర వ్యర్థాలతో కలపవద్దన్న నిబంధనలను ఆస్పత్రులు పాటించడం లేదు. ఫలితంగా హానికరమైన బయోమెడికల్ వ్యర్థాలు జనారోగ్యానికి, జంతువులకు ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి.

మున్సిపల్ సిబ్బందికి ఇవ్వొద్దు



ఆసుపత్రులలో నిలువచేసే బయో మెడికల్ వ్యర్థాలు మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి ఇవ్వొద్దు. నిబంధనలు పాటించిన వారిపై బయో మెడికల్ మేనేజ్‌మెంట్ రూల్స్ 2000 ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్, బ్లడ్ బ్యాంక్ యజమానులు వారి వృత్తి వ్యాపార సముదాయాల నుంచి వెలువడే చెత్తను తడి చెత్త పొడి చెత్తగా వేరు చేసి డబ్బాలలో నిల్వ ఉంచి మున్సిపల్ వాహనాలకు అందించాలి.

– దేవీదాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

మత్తు పదార్థాల నిర్మూలనకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్, పక్కన ఎస్పీ జానకీ షర్మిల

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌చైన్‌గేట్: నిషేధిత మత్తుపదార్థాలను సంపూర్ణంగా నిర్మూలించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్పీ జానకీషర్మిలతో కలిసి మత్తు పదార్థాల నిర్మూలనపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సహా నిషేధిత మత్తు పదార్థాల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. యువత మత్తు పదార్థాల బారినపడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయిని సాగుచేసినా, విక్రయించినా, రవాణా చేసినా, వినియోగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మత్తు పదార్థాలను వినియోగించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యాసంస్థల్లో మత్తుపదార్థాలతో కలిగే అనర్థాలపై విస్తృత ప్రచారం కల్పించాలని, పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారులు సమన్వయంతో ప్రత్యేక బృందాల ద్వారా తనిఖీలు చేసి మత్తు పదార్థాలను నియంత్రించాలన్నారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో చెక్ పోస్ట్ ల వద్ద నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం గురించి తెలిస్తే వెంటనే జిల్లా పోలీస్ నంబర్ 8712671111కు తెలియజేయాలన్నారు. టోల్ ఫ్రీ నంబర్ 1908ను సంప్రదించాలని తెలిపారు. మత్తు పదార్థాలకి బానిసైన వారిని విముక్తి కేంద్రంలో చేర్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. విద్య, పోలీసు, ఎక్సైజ్ శాఖలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో జిల్లాలోని విద్యాసంస్థల్లో మత్తుపదార్థాల వాడకంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంట పొలాల్లో గంజాయి సాగు చేసినట్లు తెలిస్తే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

నియంత్రణకు చర్యలు..

ఎస్పీ జానకీ షర్మిల మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాల వినియోగంపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. మండలాల వారీగా ఇప్పటి వరకు నమోదైన గంజాయి, ఇతర మత్తు పదార్థాల గురించి వివరించారు. మత్తు పదార్థాలను వినియోగించినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రతీ బుధవారం గ్రామాల్లో కళాకారులతో మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, జిల్లా ఎక్సైజ్ అధికారి రజాక్, డీఎస్పీ గంగారెడ్డి, డీఎంహెచ్వో రాజేందర్, ఎస్బీ అధికారి రాజేశ్వర్‌గౌడ్, పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



ఐ లవ్ ఎంసీకే లోగోను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఖానాపూర్: పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ శుక్రవారం భూమిపూజ చేశారు. రూ.4.80 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను ప్రారంభించారు. అంతకుముందు పట్టణ పార్కుతోపాటు పార్కు ముందు ఏర్పాటు చేసిన ఐ లవ్ ఎంసీకే లోగోను ఆవిష్కరించారు. పార్కులోని ఓపెన్ జిమ్, యోగా శాల, వాకింగ్ ట్రాక్‌ను సందర్శించారు. అనంతరం అంబేద్కర్‌నగర్‌లో నిర్మించిన వైకుంఠధామాన్ని ప్రారంభించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, వైస్ చైర్మన్ కావలి సంతోష్, కౌన్సిలర్లు, నాయకులు కిశోర్‌నాయక్, జన్నారపు శంకర్, నాయిని సంతోష్, పరిమి సురేశ్, అమానుల్లాఖాన్, తొంటి శ్రీనివాస్, షబ్బీర్‌పాషా, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు దయానంద్, నిమ్మల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి కేంద్రం కృషి

- బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి
- సీసీఐ పత్తికొనుగోలు కేంద్రం ప్రారంభం




మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

సారంగపూర్: రైతుల కష్టం తెలిసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ రైతుల అభ్యున్నతే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కేదారీనాథ్ జిన్నింగ్ మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. అనంతరం స్థానిక రైతువేదిక భవనంలో 33 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతుల రుణాలు మాఫీ చేస్తున్నామంటూ గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్ర సర్కారు కొంతమంది రైతుల రుణాలు మాత్రమే మాఫీ చేసిందని తెలిపారు. కనీసం రైతు భరోసా డబ్బులు కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. రైతు కష్టం తెలిసిన నేత ప్రధానమంత్రి నరేంద్రమోదీ రైతులకు పీఎం కిసాన్ పథకం ద్వారా ఇప్పటికే డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేశారన్నారు. రైతులకోసం సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేపడుతున్నారన్నారు. రానున్న రోజుల్లో రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని తెలిపారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ....

మండలంలోని కొట్ల(బి) శాంతినగర్ నుంచి అడెల్లి తండా వరకు రూ.2.40 కోట్లతో ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో నిర్మించే బీటీరోడ్డు పనులకు ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి శుక్రవారం భూమిపూజ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గిరిజన గ్రామాలకు పక్కారోడ్లు ఉండాలన్న లక్ష్యంతో ప్రతీ తండాను అనుసంధానిస్తూ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి సొంతింటికల సాకారం చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అబ్దుల్‌హాదీ, బీజేపీ మండల అధ్యక్షుడు విలాస్, నాయకులు గంగారెడ్డి, చంద్రప్రకాశ్‌గౌడ్, రాంశంకర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, సామల వీరయ్య, రాంరెడ్డి, చెన్ను రాజేశ్వర్, భూమారెడ్డి, తిరుమల చారి, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో లక్ష్మీకాంత రావు, ఏఎంసీ కార్యదర్శి ధూమ్యానాయక్, ఆర్అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

స్థలం కోసం కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న దివ్యాంగులు

నిర్మల్‌చైన్‌గేట్: దివ్యాంగుల సంఘ భవనానికి స్థలం కేటాయించాలని తెలంగాణ దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ అభిలాష అభినవ్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు కలెక్టర్‌కు వారి సమస్యను విన్నవించారు. జిల్లాలోని అన్ని కుల సంఘాలకు భవనాలు ఉన్నాయని, దివ్యాంగుల సంఘానికి భవనం లేదని తెలిపారు. తహసీల్దార్ ఆఫీస్ పక్కన ఉన్న స్థలంలో కేటాయించడంతోపాటు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సట్టి సాయన్న, కె.ప్రవీణ్‌కుమార్, కె.భగవాన్, టి.ముత్యం, బి.రాజేశ్వర్, ఎస్.సత్యనారాయణ, ఈ.భూమేష్, జి.శ్రీనివాస్, ఎస్. చిన్నక్క, సౌమ్య ఉన్నారు.

దోబూచులాడుతున్న బెబ్బులి



పులి పాదముద్ర సేకరిస్తున్న అధికారులు



పులిని ప్రత్యక్షంగా చూసిన తండా వాసులు

- మహారాష్ట్రలోకి వెళ్లి.. మళ్లీ జిల్లాలోకి..
- వేటాడుతూ కుంటాలకు వచ్చిన వైనం
- పాదముద్రలు గుర్తించిన అధికారులు



కుంటాలలో గుర్తించిన పులి పాదముద్ర

కుంటాల: అటవీశాఖ అధికారులతో పెద్దపులి దోబూచులాడుతోంది. పక్షం రోజుల క్రితం ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని అటవీ ప్రాంతంలోకి వచ్చిన పులి.. తర్వాత సారంగపూర్ మండలంలోని అడవిలోకి వచ్చింది. ఓ కోడె దూడపై దాడిచేసింది. తర్వాత రాష్ట్ర సరిహద్దులు దాటి మహారాష్ట్రలోకి వెళ్లింది. కానీ, మరుసటి రోజే కుంటాల మండలంలోకి అడుగు పెట్టింది. ఓ ఆవుపై దాడిచేసి చంపింది. పది రోజులు మండలంలోనే వివిధ ప్రాంతాల్లో సంచరించిన పులి.. గురువారం రాష్ట్ర సరిహద్దులు దాటింది. మహారాష్ట్రలోకి వెళ్లింది. కానీ, తెల్లవారే సరికి యూటర్న్ తీసుకుని మళ్లీ కుంటాల మండలంలోకి వచ్చింది.

కుంటాలలో మళ్లీ ప్రత్యక్షం..

మహారాష్ట్ర వైపు పులి వెళ్లిందని అధికారులు భావించారు. కానీ దొనెల్లి అటవీ ప్రాంతం నుంచి వేటాడుతూ శుక్రవారం వేకువ జామున కుంటాలలో ప్రత్యక్షమైంది. కుంటాలకు చెందిన పలువురు యువకులు దొనెల్లి, ప్రాణహిత- చేవెళ్ల కెనాల్‌వైపు వాకింగ్ వెళ్లారు. వారికి పెద్దపులి కనిపించడంతో అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. జక్కుల సతీశ్, తోట రాఘవేందర్ చేలల్లో పులి పాదముద్రలను గుర్తించినట్లు టైగర్ కన్జర్వేషన్ సొసైటీ సిబ్బంది మల్లేశ్ తెలిపారు. కుంటాల నుంచి హనుమాన్‌నగర్ తండాకు వెళ్లిన పులిని గ్రామస్తులు ప్రత్యక్షంగా చూశారు. భయంతో చెట్లు ఎక్కి అధికారులకు సమాచారం ఇచ్చారు. అక్కడి నుంచి పులి దొనెల్లి, గొల్లమాడ అటవీ ప్రాంతం వైపు వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. పోలీసులు, అటవీశాఖ అధికారులు మూడు బృందాలుగా విడిపోయి పులి రక్షణకు గాలింపు చేపట్టినట్లు ఎఫ్ఆర్వో వేణుగోపాల్ తెలిపారు. పులి గాలింపులో ఎస్సై భాస్కరాచారి, డీఆర్వో రేష్మ, ఎఫ్ఎస్‌వోలు కీర్తిరెడ్డి, పూర్ణిమ, హైదరాబాద్ టైగర్ సేఫ్టీ అధికారి మల్లేశ్, ఎఫ్‌బీవోలు హరిలత, ముస్తాక్ ఉన్నారు.

పక్షం రోజులుగా..

మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ నుంచి వచ్చిన పెద్దపులి ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్ అటవీ ప్రాంతం నుంచి నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలో అడెల్లి తాండా మీదుగా మళ్లీ మహారాష్ట్రలోని అప్పారావుపేట్ రేంజ్ వెళ్లింది. అక్కడి నుంచి గత శుక్రవారం కుంటాల మండలంలోని సూర్యాపూర్-మెదన్‌పూర్ అటవీ ప్రాంతంలోని బుడుబుడు జల వద్ద పశువులపై దాడి చేసింది. అక్కడి నుంచి అంబుగామ అటవీ ప్రాంతంలో సంచరించినట్లే సంచరించి దొనెల్లి అటవీ ప్రాంతం నుంచి మహారాష్ట్రలోని అప్పారావుపేట్ రేంజ్ పంగర్ పాడ్ సరిహద్దులో సంచరించింది. గురువారం మహారాష్ట్ర, తెలంగాణ అటవీ అధికారులు సంరక్షణ చర్యలు చేపట్టి పులి పాదముద్రలు గుర్తించారు.

పులి రక్షణకు చర్యలు...

పులి సంరక్షణ చర్యలు చేపట్టాం. పులి రైతుకు మిత్రుడు లాంటిది. పంటలపై వన్యప్రాణులు దాడి చేయకుండా పులి కాపాడుతుంది. పంటల చుట్టూ విద్యుత్ కంచెలు, ఉచ్చులు ఏర్పాటు చేయొద్దు. పులికి హాని తలపెట్టొద్దు. నిర్ణీత సమయంలో పనులు ముగించుకుని రావాలి.

– వేణుగోపాల్, ఎఫ్ఆర్వో

జోనల్ క్రీడలకు ఏర్పాట్లు

ముధోల్: మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాలలో ఈ నెల 11 నుంచి నిర్వహించే జోనల్ క్రీడలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు నర్సింహారెడ్డి శుక్రవారం తెలిపారు. జోనల్ పరిధిలోని ఆదిలాబాద్, నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల్, కామారెడ్డి, జిల్లాల నుంచి అండర్-14, 17, 19 విభాగాల్లో బాలురకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, హ్యాండ్ బాల్, చెస్, క్యారం అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయని తెలిపారు. 12 గురుకుల పాఠశాలలకు చెందిన 1,020 మంది క్రీడాకరులు పోటీల్లో పాల్గొననున్నట్లు వెల్లడించారు. ప్రశాంత వాతారవణంలో క్రీడలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

- వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

లోకేశ్వరం: ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని వరంగల్ ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి సూచించారు. మండలంలోని రాజూర, మన్మద్, హవర్గ కిష్టాపూర్, లోకేశ్వరం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆర్జేడీ వరంగల్ సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ఎన్ఎస్ఎస్ పరీక్షలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతోపాటు విద్యను అందించాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తు మెరుగుపడేలా చూడాలన్నారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు జెడ్ల రాజేశ్వర్, సురేశ్, ముత్తన్న, జయసుందర్ ఉన్నారు.

పారదర్శకంగా ప్రత్యేక ఉపాధ్యాయుల నియామకం

నిర్మల్: జిల్లాలో ప్రత్యేక ఉపాధ్యాయుల కౌన్సెలింగ్‌ను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించామని డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 2న పాఠశాల విద్యాశాఖ సంచాలకుల నుంచి వచ్చిన ఆదేశాలు, పంపిన జాబితా ఆధారంగా కౌన్సెలింగ్ చేపట్టినట్లు తెలిపారు. మొత్తం 23 ఎస్జీటీ పోస్టులకు రెండు ఉర్దూ మీడియం పోస్టులు ఉండగా, తెలుగు మీడియంలో 21 పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. తెలుగు మీడియం పోస్టులకు సంబంధించి 15 మంది అర్హులు కాగా, రోస్టర్ ప్రకారం 14 మందికి పోస్టింగ్ ఇచ్చామన్నారు. ఏడు పోస్టుల కేటగిరీకి సంబంధించి అర్హులైన అభ్యర్థులు లేనందున మిగిలాయన్నారు. ఉర్దూ మీడియం అభ్యర్థులు లేనందున రెండు పోస్టులు కూడా ఖాళీగానే ఉన్నట్లు తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ ఐదు పోస్టులు ఉండగా, అర్హులైన ఐదుగురు అభ్యర్థులను నిబంధనల ప్రకారమే భర్తీ చేసినట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

రగ్బీ పోటీలకు విద్యార్థులు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

బేల: మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే గురుకులానికి చెందిన 9వ తరగతి విద్యార్థులు ఎ.లఖన్, బి.సాయిచరణ్, ఎం.ప్రదీప్‌లు రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జరిగిన జోనల్ స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చి, ఈ నెల 10 నుంచి హైదరాబాద్ మల్కాజిగిరిలో జరిగే రాష్ట్రస్థాయి అండర్ 17 పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం ముగ్గురు విద్యార్థులను ప్రిన్సిపాల్ రంగన్న, ఉపాధ్యాయ బృందం అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ శివన్న పాల్గొన్నారు.

మునిపల్లి విద్యార్థికి జాతీయ పురస్కారం


పురస్కారం అందుకుంటున్న కల్లెడ అభిలాష్

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లి గ్రామానికి చెందిన విద్యార్థి కల్లెడ అభిలాష్ జాతీయ పురస్కారం అందుకున్నారు. మండలంలోని మునిపెల్లి గ్రామానికి చెందిన కల్లెడ పవిత్ర – ప్రసాద్ దంపతుల కుమారుడు అభిలాష్ తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ, మాచి రాజు సాహిత్య కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ కథల పోటీల్లో పాల్గొని 'మంచి మనుసు' అనే కథా సంపుటిని రాశారు. ఇందుకు జాతీయ పురస్కారం లభించింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారం అందుకున్నారు. అభిలాష్ జగిత్యాల జిల్లాలోని ఏర్గట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తికి జైలు

మంచిర్యాలక్రైం: రోడ్డు ప్రమాదానికి కారణమైన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం మర్కటోలకు చెందిన కిషోర్‌కుమార్‌కు మంచిర్యాల స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ జడ్జి ఉపనిషద్వని ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. మంచిర్యాల పట్టణ సీఐ ప్రమోద్‌రావు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. భీమిని మండలం మల్లిడి గ్రామానికి చెందిన దుర్గం చంద్రయ్య మంచిర్యాల పట్టణంలోని బెల్లంపల్లి చౌరస్తాలో 2016 అక్టోబర్ 14న రోడ్డుపై లారీ ప్రమాదానికి గురై చనిపోయాడు. అతడి భార్య తలకు గాయమై ఆస్పత్రిలో చేరింది. అప్పటి ఎస్సై అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో ప్రమాదానికి కారణమైన కిషోర్‌కుమార్‌కు జైలు శిక్ష విధించారు.

మ్యాట్రీమోని పేరుతో రూ.17లక్షలు



ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లాకు చెందిన ఎర్ర వెంకటనాగరాజు, సౌజన్య దంపతులు మ్యాట్రీమోని పేరుతో అందమైన అమ్మాయిల ఫొటోలతో ఫేస్‌బుక్ ఖాతా ఏర్పాటు చేసి ఇతరులకు ఫ్రెండ్ రిక్వెస్ట్ చేయడం, పెళ్లి సంబంధాల కోసం వివరాలు ఇచ్చిన వారికి ఫ్రెండ్ రిక్వెస్ట్ పెట్టడం, ఫ్రెండ్ రిక్వెస్ట్ అక్సెప్ట్ చేయగానే వారితో చాటింగ్ చేస్తూ పరిచయం పెంచుకుని కొంతకాలం తర్వాత బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బులు డిమాండ్ చేసేవారు. ఈ క్రమంలో జిల్లాకు చెందిన ఓ యువకుడిని బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు డిమాండ్ చేయగా.. దశలవారీగా రూ.17లక్షలు ముట్టజెప్పాడు. అయినా వేధింపులు ఆగకపోవడంతో యువకుడు రామగుండం సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు వెంకటనాగరాజు, సౌజన్యలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పార్ట్‌టైమ్ ఉద్యోగం అంటూ..



ఇన్‌స్టాగామ్ యాప్‌లో పార్ట్ టైమ్ ఉద్యోగం పేరుతో నస్పూర్‌లోని రాంనగర్‌కు చెందిన అడెపు శివకుమార్‌తోపాటు తన బంధువులు, స్నేహితులు రూ.1,57,319 సైబర్ మోసగాళ్ల చేతిలో నష్టపోయారు. శివకుమార్ తన ఇన్‌స్టాగామ్ యాప్‌లో పార్ట్ టైం ఉద్యోగం లింక్‌ను ఓపెన్ చేయగా టెలిగ్రామ్ యాప్‌లో సయ్యద్ మెకలిన్ అనే గుర్తు తెలియని వ్యక్తుల ప్రొఫైల్స్‌తోపాటు మరికొందరికి చెందిన ప్రొఫైల్స్ ఓపెన్ అయ్యాయి. కొంత పెట్టుబడి పెడితే రెట్టింపు డబ్బులు వస్తాయని చెప్పడంతో పలు దఫాలుగా రూ.1,57,319 ఫోన్ పే ద్వారా పంపించారు. సమాధానం రాకపోవడం, ఫోన్లు స్విచ్ఛాఫ్ రావడంతో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

క్రిప్టో మోసం..



క్రిప్టో పేరుతో సీతరాంపల్లి గ్రామానికి చెందిన బొల్లం భీమయ్య రూ.67వేలు నష్టపోయాడు. 2024 అక్టోబర్ 10న తన ఇన్‌స్టాగామ్ యాప్‌లో క్రిప్టో అనే పేజీ ప్రకటనలో రూ.10వేలు పెట్టుబడి పెడితే రెట్టింపు డబ్బు వస్తుందని చెప్పడంతో భీమయ్య గుర్తు తెలియని వ్యక్తి పంపిన బ్యాంకు ఖాతాకు పలు దఫాలుగా రూ.67వేలు పంపించాడు. సదరు వ్యక్తి నుంచి సమాచారం రాకపోవడం, ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నంబర్ 1930లో ఫిర్యాదు చేయగా రూ.32వేలు ఫ్రీజ్ చేశారు.

- మ్యాట్రీమోని పేరుతో మోసాలు
- ఓటీపీ చెప్పకపోయినా బ్యాంకు ఖాతా ఖాళీ

సైబర్ చోరులు



మంచిర్యాలక్రైం: ఆధునిక టెక్నాలజీని తమకు అనుకూలంగా మలుచుకుని కొందరు సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు. ఎప్పటికప్పుడు కొత్త దారులు వెతుకుతూ దోచుకుంటున్నారు. పోలీసు యంత్రాంగం ఎంత అప్రమత్తం చేస్తున్నా ఎక్కడో ఒక చోట మోసాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. ఝార్ఖండ్‌లోని జమ్‌తార జిల్లాలోని ఏడు గ్రామాలకు చెందిన యువత సైబర్ నేరాలే ప్రధాన ఆదాయ వనరుగా మలు చుకుని మోసాలకు పాల్పడుతున్నట్లు సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. బ్యాంకుల్లోని ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, కాల్‌సెంటర్లు తదితర మార్గాల్లో డెబిట్ కార్డుల డేటా సైబర్ మోసగాళ్లకు చేరుతోంది. బోగస్ పేర్లు, చిరునామాలతో సిమ్‌కార్డులు తీసుకునే జమ్‌తార యువకులు వాటి విని యోగానికి బేసిక్ మోడల్, తక్కువ ఖరీదున్న సెల్‌ఫోన్లు వాడుతుంటారు. వీటితో తమ వద్ద ఉన్న సమాచారంతో బ్యాంకు వినియోగదారులకు ఫోన్ చేస్తుంటారు. ఇటీవల కాలంలో అందరి ఫోన్లలోనూ ట్రూ కాలర్ తరహా యాప్స్ ఉంటున్నాయి. బోగస్ సిమ్‌కార్డుల వినియోగదారులు ముందుగానే ఆయా నంబర్లను సదరు యాప్‌లో 'బ్యాంకు హెడ్ ఆఫీస్' పేరుతో రిజిష్టర్ చేస్తున్నారు. ఫలితంగా ఈ నంబర్ నుంచి ఫోన్ రాగానే బ్యాంకు నుంచి అనే భావన కలిగి తేలిగ్గా బుట్టలో పడుతున్నారు. ప్రతీ లావాదేవీకి ఒక ఓటీపీ కచ్చితంగా ఉండాలి. దీనిని పదేపదే వినియోగదారుడిని అడగకుండా కొత్త ఎత్తు వేస్తున్నారు. లక్ష్యంగా చేసుకున్న వారికి లింకులు పంపించడం ద్వారా టీమ్ వ్యూయర్ యాప్స్ డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఓ పాస్‌వర్డు చెప్పి యాక్టివ్ చేసుకోవాలని చెబుతున్నారు. బాధితుడు యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని యాక్టివేట్ చేసిన వెంటనే ఫోన్ స్క్రీన్ సైబర్ నేరగాడి ల్యాప్‌టాప్‌లో కనిపిస్తుంది. ఫలితంగా వచ్చిన ప్రతీ ఓటీపీని అడగాల్సిన పని లేకుండానే వీలైనంత వరకు ఖాతా ఖాళీ చేయడానికి ఆస్కారం ఏర్పడుతోంది.

పకడ్బందీ పరిశోధనతోనే..

ఒక్కసారి బాధితుడి ఖాతా నుంచి ఖాళీ అయిన డబ్బులు రాబట్టడం అంత సులభమేమి కాదు. తెలంగాణ పోలీస్ యంత్రాంగం సైబర్ నేరగాళ్లకు సంకెళ్లు వేసేందుకు పోలీస్ సిబ్బందికి ప్రత్యేక అవగాహన, శిక్షణ కల్పించింది. ఫిర్యాదు అందిన వెంటనే బాధితుడు పోగొట్టుకున్న డబ్బు ను రాబట్టడంపై దృష్టి సారిస్తున్నారు. అనంతరం నేరస్తులు వినియోగించిన సెల్‌ఫోన్ నంబర్ల ఆధారంగా బాధితుడి ఖాతా నుంచి డబ్బు ఎక్కడికి బదిలీ అయింది..? ఆన్‌లైన్ షాపింగ్ జరిగితే ఏ చిరునామాకు వస్తువు, సామగ్రిని ఆర్డర్ చేశారు..? తదితర వివరాల ఆధారంగా దర్యాప్తు చేస్తారు.

11యాప్‌లు గుర్తించాం..



సైబర్ నేరగాళ్లు ఉపయోగించే 11యాప్‌లను గుర్తించాం. వీటిని ఇన్‌స్టాల్ చేసుకుని పాస్‌వర్డు సైబర్ నేరగాళ్లకు చెబితే మన ఫోన్ వారి యాక్సెస్‌లోకి వెళ్తుంది. ఇలాంటి యాప్స్‌ను సైబర్ నేరగాళ్లు వినియోగించాలంటే కచ్చితంగా బాధితుడి ఫోన్ యాక్టివ్‌గా ఉండాలి. స్క్రీన్ లాక్ చేస్తే నేరగాళ్లు యాక్సెస్ చేయలేరు. అందుకే వీటిని వినియోగించి టోకరా వేసే సైబర్ క్రిమినల్స్ ఆ సమయంలో బాధితులకు ఫోన్ చేసి మాటల్లో ఉంచుతారు. అపరిచితులు పంపే లింకులు ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయకూడదు. బ్యాంకర్లు ఫోన్లు చేయరు, వ్యక్తిగత సమాచారం అడగరని గుర్తుంచుకోవాలి. ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

– ఎం.శ్రీనివాసులు, రామగుండం పోలీస్ కమిషనర్

లక్ష్యాన్ని సాధించాలంటే పట్టుదల, క్రమశిక్షణ ఉండాలి

- బీహార్ పరిపాలనా విభాగం ముఖ్య కార్యదర్శి బొమ్మకంటి రాజేందర్


పాఠశాలలో మాట్లాడుతున్న రాజేందర్

బోథ్: కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే లక్ష్యాన్ని సాధించవచ్చని బీహార్ రాష్ట్రంలో పరిపాలన విభాగం ముఖ్య కార్యదర్శి బొమ్మకంటి రాజేందర్ అన్నారు. బోథ్ మండలంలోని కౌఠబి గ్రామానికి చెందిన రాజేందర్ ప్రస్తుతం బీహార్ రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల తన సొంత గ్రామానికి వచ్చిన ఆయన తాను చదువుకున్న పాఠశాలను శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో తిరుగుతూ తన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పాఠశాలలో అమలవుతున్న పథకాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఉపాధ్యాయులతో ముచ్చటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరచుకుని, వాటిని సాధించేందుకు ప్రయత్నించాలన్నారు. తాను ఐఏఎస్ కావడానికి తాను పుట్టి పెరిగిన గ్రామం, చదవిన పాఠశాలే కారణమన్నారు. గ్రామాభివృద్ధికి తనవంతు సహకారం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై ప్రవీణ్ కుమార్, విశ్రాంత ఉపాధ్యాయులు వినాయక్ రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు బడాల శ్రీకాంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ రవీందర్, సోమేశ్వర్, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మందమర్రిలో నకిలీ నోట్ల కలకలం


వ్యాపారి వద్ద ఒకే నంబర్‌తో ఉన్న రూ.200 నోట్లు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని పాల చెట్టు ఏరియా కూరగాయల మార్కెట్‌లో నకిలీ కరెన్సీ నోట్లు కలకలం రేపుతున్నాయి. హోల్‌సేల్ కూరగాయల వ్యాపారి పవన్‌కుమార్ చిరు వ్యాపారులకు కూరగాయలు వేసి సాయంత్రం డబ్బులు తీసుకెళ్తుంటాడు. ఈ క్రమంలోనే ఈ నెల 5న కూరగాయల వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేసుకుని ఇంటికి వెళ్లి లెక్కించే సమయంలో నకిలీ రూ.200 నోట్లు కనిపించాయి. ఒకే నంబరుతో ఉన్న మూడు కరెన్సీ నోట్లు దర్శనమిచ్చాయి. గురువారం రూ.200 నోట్లు మరో రెండు ఆయనకే వచ్చాయి. వీటిపైనా ఒకే నంబర్లు ఉండడం గమనార్హం. మార్కెట్‌లో రూ.200, రూ.500 నోట్లు నకిలీవి చెలామణి అవుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నకిలీ నోట్ల విషయమై ఎస్సై రాజశేఖర్‌ను సంప్రదించగా.. వ్యాపారి పవన్‌కుమార్‌కు నకిలీ నోట్లు వచ్చాయని తెలిపాడని, ఆ నోట్లను తీసుకుని రావాలని సూచించగా రాలేదని పేర్కొన్నారు. నకిలీ నోట్లపై పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానం వస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు.

బాలింత అదృశ్యం

- మూడు రోజుల క్రితం ఆడపిల్ల జననం
- శుక్రవారం మధ్యాహ్నం నుంచి కనిపించని తల్లి
- నిర్మల్ మాతాశిశు ఆస్పత్రిలో ఘటన


నాగమణి

నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆస్పత్రి నుంచి బాలింత శుక్రవారం అదృశ్యమైంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భైంసా మండలం అస్గుల్ గ్రామానికి చెందిన నాగమణి మూడు రోజుల క్రితం ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈమెకు భర్త సాయినాథ్, ఇదివరకే ఒక పాప, బాబు ఉన్నారు. భర్త వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తల్లి బిడ్డ ఆరోగ్యంగానే ఉనానరు. అయితే మధ్యాహ్నం తర్వాత నుంచి నాగమణి కనిపించలేదు. దీంతో బంధువులు ఆస్పత్రి ఆవరణలో వెతికారు. ఆచూకీ లేకవడంతో భర్త సాయినాథ్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో సాయంత్రం ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ఆస్పత్రికి వెళ్లి సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఇందులో నాగమణి తానే స్వయంగా బెడ్ మీది నుంచి ఆస్పత్రి బయటకు వెళ్లినట్లు రికార్డు అయింది. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

వరకట్న వేధింపులకు వివాహిత బలి


వివాహిత మృతదేహం వద్ద వివరాలు నమోదు చేసుకుంటున్న తహసీల్దార్, ఎస్సై

దస్తురాబాద్: వరకట్న వేధింపులకు జిల్లాలో మరో వివాహిత బలైంది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండంలోని రేవోజీపేట గ్రామానికి చెందిన సంద నాగరాజుకు జగిత్యాల జిల్లా సారాంగపూర్ మండలం రేచపల్లి గ్రామానికి చెందిన లతతో ముడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి 15 నెలల కుమారుడు ఉన్నాడు. కొన్ని రోజులుగా భర్త నాగరాజు, అత్త, మామ సంద సత్తవ్వ, వెంకటి అదనపు కట్నం తేవాలని లతను వేధిస్తున్నారు. వేధింపులు ఎక్కువ కావడంతో శుక్రవారం బాత్‌రూంలో ఉరివేసుకుంది. సంఘటన స్థలాన్ని తహసీల్దార్ నావాజ్ సర్ఫరాజ్ చేరుకుని పంచనామా చేశారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. మృతురాలి తల్లి పోగుల మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కలప తరలించిన ముగ్గురికి రిమాండ్


జైలు వద్ద నిందితులతో అటవీ అధికారులు

కడెం: ఖానాపూర్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జితిన్ కుమార్ ఈనెల 6న ఇచ్చిన తీర్పు మేరకు ముగ్గురు కలప నిందితులను 14 రోజుల రిమాండ్‌కు తరలించినట్లు ఉడుంపూర్ ఎఫ్ఆర్వో అనిత తెలిపారు. మొత్తం ఏడుగురు నిందితుల్లో నలుగురు పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. కుంట పవన్, మేడిశెట్టి మహేశ్, తనుగుల దుర్గయ్యను రిమాండ్ నిమిత్తం జిల్లా కేంద్రంలోని సబ్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

కారు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

కాసిపేట: కాసిపేట పోలిస్‌స్టేషన్ పరిధిలోని పాత బెల్లంపల్లి క్రాసింగ్ సమీపంలో శుక్రవారం సాయంత్రం కారు ఢీకొని లంబాడితండాకు చెందిన ధరావత్ తిరుమల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రహదారిపై లంబాడితండా నుంచి పాతబెల్లంపల్లి వైపు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో ఎగిరి డివైడర్‌పై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఢీకొట్టిన కారు ఆపకుండా వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ను సంప్రదించగా.. ఇప్పటివరకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

కుక్క పిల్లలకు బారసాల


బారసాల చేస్తున్న రవి కుటుంబ సభ్యులు

కడెం: నిర్మల్ జిల్లా కడెం మండలం చిన్నబెల్లాల్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ గిరివేణి రవి తన ఇంట్లో కుక్క పిల్లలకు శుక్రవారం బారసాల చేశాడు. రవి పెంచుకుంటున్న కుక్క ఇటీవలే మూడు పిల్లలకు జన్మనిచ్చింది. శుక్రవారానికి అవి పుట్టి 21 రోజులు కావడంతో బారసాల చేశడు. బంధువులను, చుట్టుపక్కల వారిని పిలిచి అందరికీ భోజనాలు పెట్టాడు.

పురుగుల మందు తాగి విద్యార్థిని ఆత్మహత్య

ఇంద్రవెల్లి: పురుగుల మందు తాగి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం మండలంలోని దస్నాపూర్‌గూడ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దస్నాపూర్‌గూడ గ్రామానికి చెందిన జవాదే విలాస్ –కవిత దంపతుల కూతురు జవాదే అంజలి(13) బజార్‌హత్నూర్ మండలకేంద్రంలోని కేజీబీవీలో 8వ తరగతి చదువుతోంది. శుక్రవారం ఉదయం తల్లి కవితతో కలిసి వ్యవసాయ చేనులో పత్తి ఏరడానికి వెళ్లింది. సాయంత్రం నీళ్లు తాగి వస్తానని తల్లితో చెప్పి ఇంటికి వెళ్లిన అంజలి ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి స్పృహ కోల్పోయింది. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా ఆటోలో మండలకేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో 108 అంబులెన్స్‌లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. కాగా ఆత్మహత్యపై ఎవరూ ఫిర్యాదు అందలేదని ఎస్సై దుబ్బక సునీల్ తెలిపారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన హబీబ్ ఖాన్(42) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు జైనథ్ ఏఎస్సై ఆత్మారాం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఖుర్షీద్‌నగర్‌కు చెందిన హబీబ్‌ఖాన్ తన రెండో భార్య మర్డర్ కేసులో నిందితుడిగా ఉన్నాడు. జైలుకు వెళ్లి ఇటీవల బయటకు వచ్చాడు. జైనథ్‌మండలంలోని మేడిగూడలో తన మొదటి భార్య జమీలా పిల్లలతో కలిసి పుట్టింట్లో ఉంటుంది. కాగా శుక్రవారం మేడిగూడ గ్రామ సమీపంలోని పంట పొలాల్లో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన జేబులో ఉన్న సూసైడ్ నోట్‌లో తన రెండో భార్యను హత్య చేశానని, తనకు జీవించే హక్కు లేదని ఉన్నట్లు ఏఎస్సై తెలిపారు. తన ఆత్మహత్యకు మొదటి భార్య, పిల్లలకు సంబంధం లేదని అందులో రాసి ఉందన్నారు. కాగా భార్య జమీలా తన భర్త కొంత కాలంగా మద్యానికి బానిసై తనను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, పలుమార్లు నచ్చజెప్పినా వినిపించుకోలేదని తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వివరించారు.

ఒకరిపై హత్యాయత్నం కేసు

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలోని కొమ్ముతండాకు చెందిన జి.రమేశ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. గ్రామంలోని కిరాణ దుకాణం నిర్వాహకుడు జి.రమేశ్‌కు అదే గ్రామానికి చెందిన సమీప బంధువు గుగ్లావత్ రమేశ్‌నాయక్‌కు పాత గొ డవలు ఉన్నాయి. జి.రమేశ్ గురువారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న గుగ్లావత్ రమేశ్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించేందుకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి కేకలు వేయడంతో పారిపోయాడు. ఈ మేరకు గుగ్లావత్ రమేశ్ తల్లిఇచ్చిన ఫిర్యాదు మేరకు జి.రమేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నామని ఎస్సై తెలిపారు.